# చిట్టి కథ




ఆది కొత్తగా వెలసిన కాలనీ. అక్కడ ఓ 'మహిళా మండలి'. దానిలో ఆ రోజు కాలనీ లోని వనితలందరకు వక్తృత్వ పోటీ జరుగుతోంది. పక్కపక్క ఇళ్ళవాళ్ళు తప్ప అందరం ఒకరి కొకరు కొత్త. పాల్గొనే వారందరూ తమ పేర్లను నోట్ చేయించుకుంటున్నారు. నాకు పాల్గొనే ధైర్యం లేదు గానీ ఆ మహిళామండలి సభ్యురాలైన మా పక్కింటి పిన్నిగారి బలవంతం మీద వినడానికి మాత్రం వచ్చాను. 'స్త్రీలకు ఉద్యోగం అవసరమా?' అన్న విషయం మీద డిబేటింగ్ జరుగుతోంది. చాలామంది స్త్రీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపుగా అందరూ ఈ కరువు కాలంలో స్త్రీలకు ఉద్యోగం అవసరమే అన్నారు. కానీ ఆఖరుగా ఒకామె మాత్రం ఆవేశంగా "భర్తకు ఉద్యోగం వుండగా భార్య ఉద్యోగం చేయవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. రోజురోజుకీ నిరుద్యోగులు పెరిగిపోతున్న ఈ కాలంలో ఉద్యోగం లేక కుటుంబాన్ని పోషించ లేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అదే ఉద్యోగం ఒక పేద నిరుద్యోగికి లభిస్తే ఒక కుటుంబాన్నంతటినీ రక్షించిన వారవుతారు. (అందరూ గట్టిగా చప్పట్లు కొట్టేశారు. నేను మాత్రం ఆలోచనలో పడ్డాను.) స్త్రీలు కూడా మగవారితో పాటు చదువులు చదవవచ్చు. విజ్ఞానం సంపాదించవచ్చు. దాని ద్వారా పిల్లలకు ఇంట్లో విద్యాబుద్ధులు నేర్పవచ్చు. క్రమ శిక్షణతో పెంచవచ్చు. అందువల్ల భర్త ఉద్యోగం చేస్తుండగా భార్య ఉద్యోగం చేయడం అనవసరం. (మళ్ళీ చప్పట్లు....) 'జీతం చాలడం లేదు' అనుకునే కన్నా మన అమ్మలు, అమ్మమ్మలు ఎలా గడిపారు అన్నది ఆలోచించాలి." (ఇప్పుడు మాత్రం ఎవరూ చప్పట్లు కొట్టలేదు. 'ఆ కాలం, ఈ కాలం ఒకటేనా?' అన్న ఆలోచనలో పడినట్లున్నారు) అంటూ ఇంకా స్త్రీలు ఉద్యోగం చేయవలసి వస్తే ఎన్ని నష్టాలున్నాయో; ఎన్ని అనుభూతుల్ని కోల్పోతున్నారో అన్నీ వర్ణించి, వర్ణించి వివరంగా చెబుతుంటే అందరూ ఆమెపై 'చప్పట్ల'తో పూల వర్షాన్ని కురిపించారు. మొదటి బహుమతి కూడా ఆవిడకే వచ్చింది. ఆవిడ చెప్పిన దాంట్లో చాలావరకు నిజాలున్నందువల్ల నేమో ఉద్యోగం చేస్తున్న నేను గిల్టీగా ఫీలయ్యాను. కాని అంతలోనే గుర్తు వచ్చింది. మా వారికి ఇద్దరు పెళ్ళికావల్సిన చెల్లెళ్ళు, ఇద్దరు చదువుకుంటున్న తమ్ముళ్ళు; రోగిష్టి తండ్రి ఉన్నారని, మాకూ ఓ పాపాయి ఉందని-మా అందరి భవిష్యత్తు కొంచెంలో కొంచెమైనా సాఫీగా సాగాలంటే నేను ఉద్యోగం చేయక తప్పదని. ఆలోచనలో పడ్డ నేను నిట్టూర్పు విడిచి పక్కకి తిరిగి చూసేసరికి ఫస్టు ప్రైజు వచ్చినావిడ గట్టిగా నవ్వుతూ ప్రక్కావిడతో ఏదో చెబుతోంది. అప్రయత్నంగా చెవులు అటు పడేశాను. "అందరూ ఒకేలా చెప్తే వాళ్ళు ప్రైజు ఎవరికి ఇవ్వాలో తెలియక కంగారు పడరా? అందుకే నేను అందరికన్నా ఆఖరుగా వెరైటీగా మాట్లాడాను. అందుకేగా నాకు ప్రైజు వచ్చింది" అంది గర్వాన్ని గొంతులో నింపుకుని. మళ్ళీ పక్కామె ఏదో అన్నట్లుంది. "నేను కూడా ఉద్యోగం చెయ్యకపోతే ఇంతమంచి చీరలెలా కొనుక్కుందునే? నాకు కావలసిన వాటికల్లా మీ బావని అడగడం నాకు ఎంత నామోషీ!" అంది. మళ్ళీ పక్కామె ఏదో అంది. "బావుంది! నేను ఉద్యోగం చేస్తున్నట్లు అందరికీ తెలిస్తే తెలియనీ. ఇలాంటివన్నీ ఇతరులకు చెప్పడానికే తప్ప తాము ఆచరించడానికి కాదని మళ్ళీ గుర్తు చేసుకుంటారు" అంది–చేతులు తిప్పుతూ, ఖరీదైన పట్టు చీరను, మెడలోని ఖరీదైన రాళ్ళనెక్లెసును ప్రదర్శిస్తూ. తరువాత తెలిసింది వాళ్ళాయన పెద్ద ఆఫీసరని అయినా ఈవిడ కూడా పెద్ద ఉద్యోగం చేస్తోందని!

—జి. శారద

# గర్భరక్షాంబిక

"సర్వం దైవమయం జగత్" అంటుంది మన భక్తివేదాంతం। అయినా ఊరూరా, వాడవాడలా దేవాలయాలు నిర్మించి, అద్భుతమైన దేవతా విగ్రహాలు ప్రతిష్ఠించి, ప్రతి రోజూ పూజలూ, నెల నెలా ఉత్సవాలూ, ఊరేగింపులూ జరపడం మన దేశంలో సర్వసాధారణమైన విషయం।

అంతేకాదు. లెక్కకు మించిన మన దేవుళ్ళలో ఒక్కో దేవునిలో ఒక్కో మహత్తును సందర్శిస్తూ, యేటా యాత్రలు చేస్తూ, మొక్కుబడులు చెల్లించడం కూడా మన దేశంలో తరతరాలుగా వస్తూన్న సంప్రదాయం।

ఈ సంప్రదాయ వటవృక్షానికి తల్లి వేరు – మనలోని అచంచలమైన భక్తివిశ్వాసాలు మన అనుభవజ్ఞానం, దానికి కొమ్మూ, రెమ్మా అయితే ప్రచార సాధనాలు పువ్వులూ, కాయలుగా వర్ధిల్లుతున్నాయి।

పవిత్ర కావేరి ప్రవహించే తంజావూరు జిల్లాలో పాపనాశం అనే వూరికి నాలుగు మైళ్ళ దూరంలో 'తిరుకరుగువూరు' అనే ప్రశాంత గ్రామ సమీపంలో వుంది అతి ప్రాచీనమైన శ్రీ గర్భరక్షాంబిక ఆలయం।

మాధవీలతలు సేదతీర్చే సుందరవనం మధ్య స్వయంభువలింగంగా ప్రసిద్ధిగాంచిన ముల్లైనాదర్ శివాలయ ప్రాంగణంలో ఈ గర్భరక్షాంబిక మందిరం వున్నది.

ఇక్కడి గర్భరక్షాంబికను భక్తిశ్రద్ధలతో సేవించే కన్యాస్త్రీలకు త్వరలో కంకణప్రాప్తి కల్గుతుందనీ, సంతానం లేనివారికి ఈ తల్లి సంతానం అనుగ్రహిస్తుందనీ, గర్భకాలంలో మాతాశిశువులకు రక్షణ కల్పిస్తుందనీ భక్తులు విశ్వసిస్తారు. ఈ విషయాలను చాలామంది భక్తులు తమ అనుభవ సత్యంగానూ చెబుతారు।

ఈ గుడిని చేరడానికి రవాణా సౌకర్యాలు గానీ, అక్కడ బస చేయడానికి గృహవసతులు గానీ అంతగా లేకపోయినప్పటికీ, చుట్టుపక్కల నుంచి రోజూ భక్తులు దేవీదర్శనానికి వస్తూనే వుంటారు। □

వర్ణచిత్రం : రాజీ